సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 25 । మార్చి । 2024



తేడా వస్తే 'రంగు పడుద్ది'!
హోలీ పండుగ అంటేనే రంగులలో మునిగి తేలుతూ ఆనందంగా గడుపుతారు. తగిన జాగ్రతలు తీసుకోకపోతే 'రంగుపడుద్ది' అని హెచ్చరిస్తున్నారు నిపుణులు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
కడప	: 6.30	5.01
పులివెందుల	: 6.33	4.56
ప్రొద్దుటూరు	: 6.32	5.05

గరిష్టం/కనిష్టం
38.6/24.6

వాతావరణం
జిల్లాలో ఆదివారం 24.6 –38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.34 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -వైవీయూ

న్యూస్‌రీల్

నేడు పవర్ లిఫ్టింగ్ ఎంపికలు



కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైయస్సార్ క్రీడా పాఠశాలలో ఈనెల 25వ తేదీ సోమవారం ఉదయం జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ అండర్ 19 పవర్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ అండర్ 19 జిల్లా కార్యదర్శి సి. శారద తెలిపారు. కావున ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

హార్సిలీహిల్స్‌పై అభివృద్ధి పనుల పరిశీలన



అతిథిగృహాలను పరిశీలిస్తున్న మధుసూదనరెడ్డి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఏపీఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదనరెడ్డి పరిశీలించారు. అటవీప్రాంగణంలోని పాత శిథిల భవనాలను రూ.30 లక్షలతో ఆధునికీకరించి మూడు అతిథిగృహాలను సిద్ధం చేశారు. వీటిని పరిశీలించిన ఆయన పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యూజియం వెనుక బండను పరిశీలించి దానిపై టెంట్ హౌస్‌లను నిర్మించేందుకు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట మదనపల్లె సబ్‌డీఎఫ్ఓ శ్రీనివాసులు, రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ఉన్నారు.

ఎర్రచందనం పరిరక్షణకు కృషి చేయాలి



లంకమల అభయారణ్యాన్ని తనిఖీ చేసిన పీపీసీఎఫ్ చిరంజీవి చౌదరి తదితరులు

సిద్దవటం: లంకమల అభయారణ్యం లోని ఎర్ర చందనం పరిరక్షణకు అటవీ శాఖ సిబ్బంది కృషి చేయాలని పీపీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. సిద్దవటం రేంజిలోని లంకమల అభయారణ్యాన్ని, సిద్దవటం రేంజి కార్యాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిద్దవటం, రోళ్లబోడు, గొల్లపల్లి బీట్లలోని ఎర్రచందనం చెట్లు ఉండే ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం పరిరక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. రోళ్లబోడు, సాబ్బావి బేస్ క్యాంపులను పరిశీలించి సిబ్బందికి అవసరమైయ్యే అదనపు వాహనాలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూల్ రేంజి సీసీఎఫ్ రామకృష్ణ, సోషల్ ఫారెస్టు డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్, కడప సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద, ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, బీటు, సహాయ బీటు అధికారులు పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్, దీపిక, హైమాతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌రెడ్డి బైక్ యాత్ర విజయవంతం కావాలి



వైఎస్సార్‌సీపీ అభిమాని అమర్‌నాథ్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అభిమాని అమర్‌నాథ్‌రెడ్డి బైక్ యాత్ర విజయవంతం కావాలని వైఎస్సార్ జిల్లా కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ప్రొద్దుటూరు మండలం, కొత్త పేట గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి కడప నుంచి ఇచ్ఛాపురం వరకూ బైక్ ప్రచార యాత్ర నిర్వహిస్తూ కడపకు వచ్చారు. ఈ మేరకు స్మిత్‌రోడ్డులో కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానంతో భార్యబిడ్డలను వదిలి బైక్ యాత్ర చేస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి అభినందనీయుడని తెలిపారు. అనంతరం అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుష్ పోశారు



'ఆయుష్'వైద్య విధానం పురాతనమైనది. ఇది పూర్వీకుల నుంచి సంక్రమించిన సంప్రదాయ వైద్యం. శరీరంపై ఎలాంటి కోత లేకుండా కేవలం మందుల ద్వారా వ్యాధులను నయం చేసే వైద్యం. ప్రధానంగా దీర్ఘకాలిక వ్యాధులను నిర్మూలించడం ఈ చికిత్స ప్రత్యేకత. ఈ విభాగంలో ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్యం ఉన్నాయి. ఈ విభాగాలన్నింటినీ కలిపి ఒక గొడుగు కిందకి తేవడంతో 'ఆయుష్'గా ఏర్పడింది. ఇన్నాళ్లు ఈ వైద్య రంగానికి జబ్బు చేయడంతో 'ఆయుష్'శాఖ మంచాన పట్టింది. తాజాగా ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. మేరకు పేరుకు తగ్గట్టుగానే వివిధ వ్యాధుల బారినపడి వారిలో 'ఆయుష్'ను నింపింది.

- ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో మౌలిక సదుపాయాలు
- బడ్జెట్ పెరుగుదల.. అందుబాటులో మందులు
- ప్రత్యేక చర్యలతో పెరిగిన ఔట్ పేషెంట్స్
- 'ఆయుష్'శాఖకు ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు



ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

రాయలసీమ జోన్‌లో 'ఆయుష్'విభాగం డిస్పెన్సరీలు

జిల్లా పేరు	డిస్పెన్సరీలు
అనంతపురం	53
చిత్తూరు	53
కడప	39
కర్నూలు	42
విభాగాలు	**డిస్పెన్సరీలు**
ఆయుర్వేదం	83
హోమియోపతి	56
యునాని	48

కడప రూరల్: ఆయుష్ శాఖలోని వైద్య విభాగాలకు మహర్దశ పట్టింది. అల్లోపతి వైద్య విధానానికి దీటుగా ఈ ఆయుష్ వైద్య విధానం అందరికీ అందుబాటులోకి వస్తోంది. ఫలితంగా వివిధ రకాలైన వ్యాధులతో బాధపడే వారికి స్వాంతన చేకూరినట్లైంది. 'ఆయుష్'విభాగంలో ఆయుర్వేదం, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య విభాగాలు ఉన్నాయి. అల్లోపతి వైద్యం రాక ముందు పూర్వం నుంచే ఆయుష్ వైద్యం అందుబాటులో ఉంది. జబ్బులను నయం చేయడంలో ఏ వైద్యానికి అదే సాటిగా పేరు తెచ్చుకున్నాయి. అన్ని వైద్య విభాగాలకు సంబంధించి అన్ని జిల్లాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి.

- ఈ వైద్య విభాగాల్లో తలనొప్పి, వెన్ను నొప్పి, నడుముల నొప్పులు, కిడ్నీ, చర్మవ్యాధులు, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు మంచి వైద్యం కలదు. అదేవిధంగా సాధారణ వ్యాధులైన జ్వరం, బీపీ, షుగర్ తదితర రోగాలకు వైద్య సేవలను లభిస్తాయి.
- రాయలసీమ (జిల్లాలు) జోన్‌కు సంబంధించి మొత్తం 187 డిస్పెన్సరీలు ఉన్నాయి. అందులో ఇటీవల 27 డిస్పెన్సరీలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ వెల్‌నెస్ సెంటర్)గా ఎంపిక చేశారు. ఒక్కో డిస్పెన్సరీ మరమ్మతులు, ఆధునికీకరణకు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. దీంతో అవన్నీ కొత్త హంగులను సంతరించుకోవడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయి. ఫలితంగా ఒక రోజుకు ఒక డిస్పెన్సరీకి వచ్చే ఔట్ పేషెంట్స్ సంఖ్య దాదాపు 20 నుంచి 50కి చేరింది.



- మొత్తం 187 డిస్పెన్సరీలకు గాను 27 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు గా మారగా మిగతా వాటిల్లోనూ మౌలిక సదుపాయాలు ఏర్పడ్డాయి. ఫలితంగా స్థానికంగా ఉంటున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.
- మండల కేంద్రాల్లో అల్లోపతితో పాటు ఆయుష్ వైద్య విభాగాలను ఒకే చోటుకు తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఉదాహరణకు ఒక మండలంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఉంటే ఆ ప్రాంగణంలోనే ఆయుష్ పరిధిలో ఉండే డిస్పెన్సరీలను సదరు పీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. ఫలితంగా స్థానికులకు అన్ని వైద్య విభాగాలు ఒకే చోటు లభించే సౌకర్యం లభించింది.

మందులకు నాడు రూ. 40 వేలు.. ఇప్పుడు రూ.లక్ష

ప్రభుత్వం మందులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు చేపట్టింది. ఒక డిస్పెన్సరీకి మందుల కోసం ఒక ఏడాదికి గతంలో రూ 40 వేలు మాత్రమే కేటాయించారు. ప్రస్తుతం రూ.లక్షకు పైగా ఖర్చు చేస్తున్నారు. అలాగే రాయలసీమ జోన్ పరిధిలో ప్రధాన ఆసుపత్రులైన కడపలోని హోమియోపతి ఆసుపత్రికి కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉన్న యునానికి, ఆయుర్వేదం ఆసుపత్రులకు అధిక నిధులను కేటాయించారు. అలాగే రోగులకు మందులను అందజేయడంలో ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.

ప్రత్యేక చొరవ

ఆయుష్ విభాగాన్ని లోపేతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. అందులో భాగంగానే ఈ డిస్పెన్సరీలు, ఆసుపత్రులు బలోపేతం అవుతున్నాయి. ఆయుష్ కమిషనర్ రాజేంద్రప్రసాద్ ప్రత్యేకంగా చేపట్టిన చర్యలు ఎంతగానో దోహదపడ్డాయనే చెప్పవచ్చు. వైద్య సిబ్బంది సక్రమంగా విధులు చేపట్టేలా చర్యలు చేపట్టారు. అలాగే ప్రభుత్వ సహకారంతో పాలనా పరమైన అంశాలను ప్రక్షాళన చేశారు.



డిస్పెన్సరీలోని లోపలి భాగం

మొత్తం మీద ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా మంచి మార్పులు సంభవించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తమ పరిధిలో మంచి వైద్య సేవలు లభిస్తున్నాయి. మందులు అందుబాటులో ఉన్నాయి. స్థానికంగా ఉంటున్న ప్రజలు డిస్పెన్సరీల్లో లభించే వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శేఖర్‌రాజు, ఆర్డీడీ, ఆయుష్ శాఖ, కడప

కోడ్ ఉల్లంఘనపై

కొరడా

194 ఫిర్యాదులకు 193 పరిష్కారం



కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మోడల్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 194 ఫిర్యాదులు అందగా అందులో 193 ఫిర్యాదులను పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ్ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగా ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా విడుదలైన ఫిర్యాదుల పరిష్కార నివేదిక ప్రకారం ఇప్పటి వరకు మొత్తం 194 ఫిర్యాదులు అందగా అందులో 193 ఫిర్యాదులకు పరిష్కారం అందగా ఒక్కటి ప్రోగ్రెస్‌లో ఉందన్నారు. ప్రింట్ మీడియా ద్వారా 45 ప్రతికూల వార్తలు (ఫిర్యాదులు) అందగా 44 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లైంట్ మానిటరింగ్ యాప్/సీఈవో ద్వారా 23 ఫిర్యాదులు అందగా.. 23, డిస్ట్రిక్ట్ కాల్ సెంటర్ ద్వారా 3 ఫిర్యాదులు అందగా మూడింటిని పరిష్కరించామన్నారు. ఎన్‌జీఎస్‌పీ (1950) ద్వారా 3 ఫిర్యాదులు అందగా మూడింటిని పరిష్కరించినట్లు వివరించారు. ఎన్‌జీఎస్‌పీ (సిటిజన్) యాప్ ద్వారా 104 ఫిర్యాదులు అందగా 104. సోషల్ మీడియా ద్వారా 7 ఫిర్యాదులు అందగా ఏడింటిని, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా 5 ఫిర్యాదులు అందగా ఐదింటిని, ఆఫ్‌లైన్ ద్వారా 4 ఫిర్యాదులు అందగా నాలుగు పరిష్కారమయ్యాయన్నారు.

స్కౌట్స్‌తో క్రమశిక్షణ, సౌభ్రాతృత్వం

మదనపల్లె సిటీ: స్కౌట్స్‌తో విద్యార్థులలో క్రమశిక్షణ, సోదరభావం, సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూల్‌లతో పాటు అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్సకు ప్రారంభ కోర్సు నందు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటుకై తమ పాఠశాల తరపున మొదట రూ.381 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. అనంతరం విద్యార్థుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. గత సంవత్సరం యూనిట్ ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ చేసిన వారు ఈ సంవత్సరం కూడా రెన్యువల్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.

క్షయవ్యాధిని అంతం చేద్దాం

కడప రూరల్: క్షయ వ్యాధి (టీబీ)ని అంతం చేసే దిశగా ముందుకెళ్తున్నామని జిల్లా క్షయనియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. ఆదివారం కడపలోని రిమ్స్ మెడికల్ కాలేజీలో ప్రపంచ క్షయ దినోత్సవం–2024 నిర్వహించారు. ముందుగా కడప మున్సిపల్ ఆఫీస్ నుంచి ర్యాలీగా మహావీర్ సర్కిల్‌కు చేరుకొని అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో 4687 క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు ఇచ్చామన్నారు. 2023 లో 4358 మంది క్షయ వ్యాధిగ్రస్తులను, 2024 లో 779 మందిని గుర్తించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం కేసుల శాతం తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. జిల్లా టీకా అధికారి ఎ. మహేశ్వర కుమార్ మాట్లాడుతూ గతంలో క్షయ వ్యాధిగ్రస్తులను ఇంటికి దూరంగా ఉంచేవారన్నారు. ఇప్పుడు అలా కాకుండా అధునాతనమైన పరీక్ష యంత్రాలు, శక్తివంతమైన మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే ప్రభుత్వం పోషణ యోజన పథకం కింద నెలకు రూ. 500 చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీవి రమాదేవి, వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

27న మేమంతా సిద్ధం



ప్రొద్దుటూరులో సభా వేదిక ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ఇడుపులపాయలో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మేయర్ సురేష్‌బాబు తదితరులు

- సీఎం వైఎస్ జగన్ తొలి ఎన్నికల సభకు చకచకా ఏర్పాట్లు
- ప్రొద్దుటూరులో బహిరంగసభ

ప్రొద్దుటూరు: 2024 ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో రాష్ట్రమంతా బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్ జగన్ బస్సు యాత్ర చేయనున్నారు. ఈనెల 27న ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన అనంతరం యాత్రను ప్రారంభించనున్నారు. ఉదయం ఇడుపులపాయలో కార్యక్రమం ప్రారంభించిన తర్వాత వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా మధ్యాహ్న భజన సమయానికి ప్రొద్దుటూరుకు చేరుకోనున్నారు. ఎర్రగుంట్ల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడిది చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీకన్యకాపరమేశ్వరి సర్కిల్, సినీ హబ్, ఆర్టీసీ బస్టాండ్, శివాలయం వీధి, రాజీవ్ సర్కిల్, కొర్రపాడు రోడ్డు మీదుగా బస్సు యాత్ర జరగనుంది. 5 గంటలకు పొట్టిపాడు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగించనున్నారు. ఇందు కోసం సభ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజులుగా మైదానంలో కుర్చీలు, షామియానాలు, వేదిక ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. సభ విజయవంతంపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.

సభను విజయవంతం చేయాలి

వేంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 27న నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కడప, రాజంపేట పార్లమెంట్ రీజనల్ కోఆర్డినేటర్, కడప మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం పరిశీలించారు. ఆదివారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్, తదితర ప్రాంతాల్లో వారు పర్యవేక్షణ చేసి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 27న ఇడుపులపాయ నుంచి బస్సు యాత్ర ప్రారంభమై కమలాపురం నియోజకవర్గం మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంటుందన్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరగనుందన్నారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, జెడ్పీటీసీ ఎమ్.రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.శ్రీనివాసులు, గండి దేవస్థానం చైర్మన్ కావలి కృష్ణతేజ పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన


ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో ఈనెల 27న సాయంత్రం జరగనున్న మేమంతా సిద్ధం సభను నిర్వాహకులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ప్రోగ్రాం కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప కార్పొరేషన్ మేయర్ సురేష్ బాబు వేదికను పరిశీలించారు. రూట్ మ్యాప్, జనసమీకరణ గురించి ఎమ్మెల్యేతో మాట్లాడారు. సభకు లక్ష మందికిపైగా హాజరవుతారని చర్చించారు. ఇడుపులపాయ, వీరపునాయునిపల్లి, ఎర్రగుంట్ల మీదుగా సీఎం జగన్ బస్సు యాత్ర వస్తుందని, సాయంత్రం 5 గంటల నుంచి సభ ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పిట్టా బాలాజీ, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం సభా వేదికను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

33 అత్యవసర శాఖల

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్



కడప సెవెన్‌రోడ్స్: పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మే 13వ తేదీ పోలింగ్ జరగనుంది. విధి నిర్వహణ కారణంగా పోలింగ్ రోజు ఓటు వేసే అవకాశం లేదు. 33 అత్యవసర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. పోలింగ్ రోజు వార్తా సేకరణలో ఉండే విలేకరులకు కూడా ఈ సౌలభ్యం ఉంటుంది. అయితే ఎన్నికల సంఘం జారీ చేసిన ఆథరైజేషన్ లెటర్ ఉండాలి. పోలింగ్ రోజు ఓటు వేయలేని వారి కోసం ఫారం –12డిలను అందుబాటులో ఉంచారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం జిల్లాలో ప్రత్యేకించి ఒక నోడల్ అధికారిని నియమించారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు కోరారు.

అత్యవసర శాఖలు: మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీసు, అటవీశాఖ, సమాచార ప్రజా సంబంధాలశాఖ, పోలీసు, పౌరరక్షణ–హోం గార్డులు, ఆహార పౌరసరఫరాలు–వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్టుమెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లు, విపత్తు నిర్వహణ.

- ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు జిల్లాలో 12,736 మంది సిబ్బంది అవసరమవుతారని అధికారులు అంచనా వేశారు. 20 శాతం రిజర్వుతో కలిపితే ఆ సంఖ్య 15,283కు చేరుతుంది. పోలింగ్ రోజున 5838 మంది పోలీసులను వినియోగించనున్నామని ఇప్పటికే ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. జిల్లాలో సర్వీసు ఎలక్టార్స్ 2378 మంది ఉండగా, ఓవర్సీస్ ఓటర్లు 119 మంది ఉన్నారు. 85+ ఏళ్ల వయస్సు ఉన్న వారు 7395 మంది ఉన్నారు. ఇక పీడబ్ల్యూడీ ఓటర్లు 18,440 మంది ఉన్నారు. వీరు 40 శాతం ఆపైబడి వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ పొందడం ఇలా..

పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి ఫారం–12డిలు సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులో వ్యక్తిగత వివరాలు, ఓటరు గుర్తింపు సమాచారం, పోస్టల్ బ్యాలెట్ ఎందుకు కోరుతున్నారో చెప్పాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేస్తారు. సర్వీసు ఓటర్లకు రిటర్నింగ్ అధికారి రికార్డు ఆఫీసు ద్వారా నేరుగా పంపుతారు. భారత దేశం వెలుపల విధులు నిర్వర్తిస్తున్న సర్వీసు ఓటర్లకు విదేశాంగశాఖ ద్వారా పోస్టల్ బ్యాలెట్లు పంపుతారు. ఇక 85+ వారి ఇంటి వద్దకే ఇద్దరు పోలింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్, సెక్యూరిటీ వచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. వీరు ఏ తేది, ఏ సమయంలో వచ్చేది ముందుగానే సమాచారం ఇస్తారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లతోపాటు డిక్లరేషన్ ఫారం, సీక్రసీ స్లీవ్, ప్రీ పెయిడ్ రిటర్న్ ఎన్వలప్‌లను రిటర్నింగ్ అధికారి ఓటర్ల చిరునామాకు పంపుతారు. ఓటరు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి డిక్లరేషన్ ఫారం భర్తీ చేయాలి. బ్యాలెట్ పేపరు, డిక్లరేషన్ ఫారం, సీక్రసీ స్లీవ్‌లో ఉంచి దాన్ని ప్రీపెయిడ్ ఎన్వలప్‌లో ఉంచాలి. ఆ కవరుపై సరిపడు పోస్టల్ స్టాంప్ అంటించి సకాలంలో తిరిగి పంపాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్లను కౌంటింగ్ కేంద్రంలో ప్రత్యేకంగా లెక్కిస్తారు.

క్లుప్తంగా

దుంపలగట్టు ఆలయంలో చోరీ


ఖాజీపేట : దుంపలగట్టు అంకాళమ్మ ఆలయంలో దొంగలు హుండీలను చోరీ చేసి కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయ ధర్మకర్తలు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో అంకాళమ్మ ఆలయం ఒకటి. భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. అయితే ఈ ఆలయంలో ఉన్న మూడు హుండీలను శనివారం రాత్రి దొంగలు చోరీ చేశారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క కూడా ఎత్తుకెళ్లారని అంటున్నారు. ఇటీవల భూమాయపల్లె ఆలయంలో చోరీ జరగ్గా తాజాగా అంకాళమ్మ ఆలయంలో కూడా చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


కడప రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (60) ఉన్నట్లు ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తమను తగిన ఆధారాలతో సంప్రదించాలని కోరారు.

కువైట్‌లో బి.మఠం మండల వాసి మృతి


రామచంద్రారెడ్డి(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరివారిపల్లె పంచాయతీ గుండాపురం గ్రామానికి చెందిన బిజివేముల రామచంద్రారెడ్డి(47) కువైట్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రారెడ్డి బతుకు తెరువు కోసం గత ఏడాది అక్టోబర్ నెలలో బేల్దారిగా కువైట్‌కు వెళ్లాడు. రామచంద్రారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రమాద వశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందకు జారిపడడంతో అక్కడే ఆసుపత్రిలో వైద్యం పొందుతూ 21న మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ఆదివారం గుండాపురం తీసుకువచ్చారు. రామచంద్రారెడ్డి మృతదేహం చూసిన భార్య, పిల్లలు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

తేడా వస్తే 'రంగు పడుద్ది'!

హోలీ పండుగ అంటేనే రంగులలో మునిగి తేలడం. పిల్లలు, యువత, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఒక్క రంగు చల్లడంతో మొదలయ్యే హంగామా.. వింత వింత రంగులు పులుముకునే వరకు వెళుతుంది. ఆనందం హద్దులు దాటుతున్న కొద్దీ.. హోలీ తీరు కూడా మారిపోతుంటుంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ముందస్తుగా తగిన జాగ్రతలు తీసుకోకపోతే 'రంగుపడుద్ది' అని హెచ్చరిస్తున్నారు నిపుణులు.



- నేడే హోలీ
- రంగులతో జరభద్రం

రాజంపేట టౌన్ : ఆనందాల రంగుల వేడుక హోలీ పండుగను సోమవారం ఘనంగా జరుపుకునేందుకు ముఖ్యంగా యువత సిద్ధమవుతోంది. నేలపై హరివిల్లు విరిసినట్లు మనుషులు అనేక రంగుల్లో కనిపించే హోలీ అంటే యువత, చిన్నపిల్లల ఆనందానికి ఆకాశమే హద్దవుతుంది. అయితే హోలీ సందర్భంగా వినియోగించే కృత్రిమ సింథటిక్ రంగులు మనిషి శరీరంపై ప్రభావం చూపుతాయి. అంతేకాక ఈ రంగులు కళ్లల్లో పడితే కంటిచూపునకు పెద్ద ప్రమాదమే ఉంటుందని వైద్యులు అంటున్నారు. అందువల్ల హోలీ సందర్భంగా రంగులు చల్లుకునే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించకుంటే హోలీ ఆనందహేళి అవుతుంది. రసాయన రంగులతో కాకుండా సహజ సిద్ధమైన రంగులతో హోలీ ఆడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

రసాయనాలతో కూడిన రంగులతో చర్మవ్యాధి సమస్యలు

రసాయనాలతో తయారు చేసిన రంగులు మనిషిపై పడితే చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదముంది. ప్రధానంగా లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రొమైడ్, మెర్క్యులీ సల్ఫేట్ వంటివాటిని కలిపి తయారు చేసే రంగులు చాలా ప్రమాదాన్ని కలిగిస్తాయి. ఈ రంగులు కళ్లల్లో పడితే కంటి చూపుపోయే ప్రమాదం కూడా ఉంది.

- రసాయనాలతో కలిసిన రంగులతో హోలీ ఆడితే శరీరంపై రంగులు ఎక్కువ సమయం ఉంచకుండా చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి
- హోలీ సందర్భంగా ఎరుపు, పింక్ రంగులను వాడితే మంచిది. ఎందుకంటే ఈ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఆ రంగులు

శరీరం నుంచి సులభంగా తొలగిపోవు

- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనె రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల రంగులు శరీరంలోకి త్వరగా ఇంకవు.
- రంగులను శుభ్రం చేసుకోవడం కూడా సులువుగా ఉంటుంది.
- ముఖంపై పడ్డ రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కంటే క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.

చిన్నపిల్లలను రంగులకు దూరంగా ఉంచాలి



చాలా మంది సరదాకోసం హోలీ పండుగ సందర్భంగా చిన్నపిల్లలకు కూడా రంగులు రాస్తారు. అయితే చిన్నపిల్లల శరీరం లేతగా ఉండటం వల్ల రసాయనాలతో తయారు చేసిన రంగులు పిల్లల చర్మంపై వెంటనే ప్రభావం చూపుతాయి. ఇక కళ్లల్లో రంగులు పడితే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందువల్ల పిల్లలను హోలీ సందర్భంగా రంగులకు దూరంగా ఉంచితే చాలా మంచిది.

డాక్టర్ వీరయ్య, చిన్నపిల్లల వైద్యులు, రాజంపేట

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలో చేరిన మాజీ సర్పంచ్, అనుచరులు

ఖాజీపేట : కులం, మతం, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి గెలిపించుకుందామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెన్నముక్కపల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో వంద కుటుంబాల వారు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సీఎం జగన్ పాలనలో మేలు జరిగిందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గ్రామ స్వరాజ్యం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేసిన విషయం గుర్తు చేశారు. అందుకే ప్రజలను మోసం చేసేవారికన్న ప్రజలకు సాయం చేసే పాలకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, బుజ్జి, మాజీ ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, కొత్తనెల్లూరు రంగారెడ్డితోపాటు మండలంలోని నాయకులు, చెన్నముక్కపల్లె ప్రజలు పాల్గొన్నారు.

విశేష అలంకారంలో గంగమ్మ తల్లి


విశేష అలంకారంలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చింతకొమ్మదిన్నె గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం రెండవ వారం జాతర ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పి.బి విశ్వనాథరెడ్డి, ఆలయ ఈఓ పి.సురేష్ కుమార్ రెడ్డి భక్తులు అందించిన 50 వేల రూపాయల విలువైన గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయాన్నే అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లలో రద్దీ ఏర్పడింది. దీంతో ఆలయ కార్యనిర్వాహకులు పోలీసుల సహకారంతో భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు.

భక్తుల జేబులకు చిల్లు

అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఐదు వారాలపాటు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఇది అదునుగా చూసుకున్న టెంకాయల వ్యాపారస్తులు కేవలం టెంకాయ 50 రూపాయలు, పూజా సామగ్రి 20 రూపాయలు, పూలమాల వంద రూపాయలు, తదితర వస్తువులకు ఒక్కొక్క రేటు పెట్టి విక్రయిస్తున్నారు.

దీంతోఆలయానికి వచ్చే భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని బయటకు వెళ్లే లోపల దాదాపు 200 రూపాయలు ఖర్చు అవుతున్నదని వాపోతున్నారు. ఆలయ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి



ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడు ద్వారా కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెంది రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నూతన తరగతి గదుల నిర్మాణం, బెంచీలు, అధునాతన టాయిలెట్‌లు, ఫ్యాన్లు, పుష్టికరమైన మధ్యాహ్నభోజనం తదితర అన్ని సౌకర్యాలను కల్పించారు. లక్షల రూపాయల ఫీజు కట్టే కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్(ఏఎఫ్‌పీ ప్యానల్స్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. అత్యాధునిక పద్ధతుల ద్వారా జ్ఞానాన్ని అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులు ప్రశంసనీయం.

- కోగటం ప్రకాశం, హెచ్‌ఎం ఎంపీయూపీ స్కూల్, ప్రకాష్‌నగర్, ప్రొద్దుటూరు

సొంతింటి కల సాకారం



దినసరి కూలికి వెళితేనే మా జీవనం సాగుతుంది. 2021 నవంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు మా ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్పట్లో మాకు రూ. 90 వేలు పరిహారం చెల్లించింది. ఆ డబ్బుతో గ్రామంలో తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసుకొని జీవిస్తున్నాము. తరువాత జగనన్న పాలనలో ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు వంతాటిపల్లి గ్రామంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. జగన్ పుణ్యమా అని నాకు సొంత ఇంటి కల నెరవేరింది.

- కొండేటి లక్ష్మీదేవి, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

ఒక్కరోజులోనే ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ఏవైనా ధ్రువపత్రాలు కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకుని అనంతరం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో చేతికందేవి కావు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామ వలంటీరుకు ధ్రువ పత్రాలు కావాలని చెప్పగానే ఒక్కరోజులోనే ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు. ఇన్ని సేవలందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- ఎ. లత, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం

కొత్తమాధవరంలో..కదిలిస్తే.. కన్నీరే!

- సుబ్బారావు కుటుంబానికి కన్నీటి వీడ్కోలు
- ఒంటరిగా మిగిలిపోయిన అవ్వ, మనవరాలు
- మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఆకేపాటి


అంత్యక్రియల కోసం సిద్ధం చేసిన సుబ్బారావు, పద్మావతి, వినయ మృతదేహాలు

రాజంపేట/ఒంటిమిట్ట : చేనేతల నివాసం ప్రాంతం.. ఎప్పుడూ సందడిగా.. నేతల హడావుడితో ఉండే కొత్తమాధవరంలో ఇప్పుడు ఎవరిని కదిల్చినా కన్నీరే వస్తోంది. సుబ్బారావు కుటుంబంలో ముగ్గురు మృతి సంఘటన ప్రతి ఒక్కరిని బాధించేలా చేసింది. ఆదివారం పోస్టుమార్టం అనంతరం స్వగ్రామమైన కొత్తమాధవరం తీసుకొచ్చిన అనంతరం ఆదివారం చేనేతల కన్నీటి వీడ్కోలు మధ్య ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఒకరి వెంట ఒకరు..

ముగ్గురి మృతదేహాలను ఒకరివెంట ఒకరిని కాటికి తీసుకెళ్లే దృశ్యాలు ప్రతి ఒక్కరి కంట కన్నీరు పెట్టించాయి. ఈ కుటుంబం పరిస్థితి చూసిన ప్రతి ఒక్కరి హృదయాలు చలించిపోయాయి. సుబ్బారావు కుటుంబంలో చివరికి మృతుని తల్లి రామలక్షుమ్మ, పెద్దకుమార్తె నిత్యలక్ష్మీప్రసన్న మిగిలారు.

టీడీపీలో జరిగిన మోసం ఫలితమే ఈ విషాదం

ముగ్గురి చావులకు కారణం.. ప్రధానంగా టీడీపీలో జరిగిన మోసమేనని చేనేత వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆన్‌లైన్ ముందు ఒకరి పేరు, ఆపైన మరొకరి పేరు కలిగి ఉండటం వల్ల మృతుని ఆశలు నిరాశలుగా మారాయి. కొత్తపల్లె గ్రామానికి చెందిన కట్టా శ్రావణి పేరు ఆన్‌లైన్‌లో ఉంది. ఆమె విదేశాలలో ఉంది. 2015లో ఆన్‌లైన్‌లో ఉన్న పేరు 2017లో మారిపోయింది, ఇది టీడీపీ ప్రభుత్వంలో సాధ్యమైంది. అప్పటి తహసీల్దారు, వీఆర్‌ఓల తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మృతులకు నివాళులు అర్పించిన ఆకేపాటి

రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆదివారం కొత్తమాధవరంలో సుబ్బారావు, పద్మావతి, వినయ మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆకేపాటి వెంట రాష్ట్ర గృహనిర్మాణసంస్థ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ అనంతరామయ్య, నందలూరు వైఎస్సార్‌సీపీ కాపు నాయకుడు అరిగెమణి ఉన్నారు.

షార్టుసర్క్యూట్‌తో అరటితోట దగ్ధం

రూ.2లక్షల మేర నష్టం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లింగాల : లింగాల మండలం రామట్లపల్లె గ్రామంలో విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన ఇరికిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన 2ఎకరాల అరటి పంట దగ్ధమైంది. యాలకి అరటి పంట సాగు చేయడంతో అరటిచెట్లు భారీగా ఎత్తు పెరగడంతో అరటిచెట్లు విద్యుత్‌లైన్‌కు తగిలి మంటలు చెలరేగాయి. వెంటనే పులివెందుల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అగ్నిప్రమాదం కారణంగా జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన అరటిపంట, డ్రిప్పు పరికరాలు పూర్తిగా కాలిపోయి రూ.2లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని రైతు వాపోయాడు. తీవ్రంగా నష్టపోయిన రైతును ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వేట కొడవలితో వ్యక్తిపై దాడి


తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ


లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో ఆకుల లక్ష్మీనారాయణ (52) పై వెన్నపూస నారాయణరెడ్డి అనే వ్యక్తి ఆదివారం రాత్రి వేటకొడవలితో దాడి చేసి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణను పులివెందుల ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు ఇటీవల లక్ష్మీనారాయణ కుటుంబంలోని మహిళల పట్ల వెన్నపూస నారాయణరెడ్డి అసభ్యకరంగా ప్రవర్తించాడని అతనిపై కేసు నమోదు చేయించారు. దీనిని మనసులో పెట్టుకున్న నారాయణరెడ్డి ఆదివారం లక్ష్మీనారాయణ తన ఇంటి బయట కూర్చొని ఉండగా వేట కొడవలితో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో లక్ష్మీనారాయణ స్పృహ తప్పి పడిపోయాడని పోలీసులు తెలిపారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

భద్రతా నియమాలు పాటిస్తేనే లక్ష్య సాధన


పీపీఈ స్టాలును ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి, సాయి రమేష్

కమలాపురం : పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు భద్రతా నియమాలు పాటిస్తే తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె. కృష్ణమూర్తి, పరిశ్రమల చీఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫీసర్ సాయి రమేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లో 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు ముందుగా పరిశ్రమలో భద్రతా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు భద్రత, ఆరోగ్యం ముఖ్యం అన్నారు. భద్రత నియమాలు పాటిస్తే తాము అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఆరోగ్యం కాపాడుకుంటే సమర్థవంతంగా పని చేయవచ్చని, తద్వారా పరిశ్రమ అభివృద్ధికి కారకులవుతారని వివరించారు. ముఖ్యంగా భద్రత గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. భావి తరాలకు తాము మేలు చేస్తున్నామా? లేదా అని తెలుసుకుని పని చేయాలన్నారు. ఫ్యాక్టరీ మేనేజర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ భద్రత అనేది మనందరి బాధ్యత అన్నారు. పరిశ్రమల్లో పని చేసే సమయంలో భద్రతా ఉపకరణాల గురించి తెలుసుకుని భద్రతా పద్ధతులను పాటిస్తూ పని చేయాలన్నారు. అనంతరం పీపీఈ స్టాలును ప్రారంభించారు. భద్రతా పోటీలలో పాల్గొని విజయం సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ డీజీఎం జగదీశ్వర్ రెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ గోపాల్‌రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీ ఓటమికి లౌకిక శక్తులు ఏకం కావాలి



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లోమతతత్వ బీజేపీని ఓడించేందుకు దేశంలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం ఇంతకాలం ఎందుకు దాచిపెట్టారన్నది ఇప్పుడు అర్థమవుతోందన్నారు. తక్షణమే బాండ్ల బాగోతంపై దేశ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫండ్ పేరుతో సాగించిన మనీ లాండరింగ్ సహా సకల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని మళ్లీ కార్పొరేట్లకు మేలు చేసేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్, శివకుమార్, ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం కాగా, సంబంధిత పోలీ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పట్టణంలోని గాంధీపురానికి చెందిన వెంకటరమణ భార్య అనిత(32) గత ఏడాది జూలై 4న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులు పలుచోట్ల ఆమె కోసం గాలించారు. కాలం గడుస్తున్నా ఆమె తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం ఆదివారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు చెందిన ఓ మైనర్ యువతి కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్ కోసం మదనపల్లెకు శనివారం సాయంత్రం వచ్చింది. చిత్తూరు బస్టాండ్‌లో యువతి కనిపించకుండా పోవడంతో తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. మదనపల్లె మండలం దుబ్బిగాని పల్లె పంచాయతీ రాయనచెరువు వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య బత్తల ఆదిలక్ష్మి(35) ఈనెల 22 మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎన్.శేఖర్ తెలిపారు.